సాక్షి ఒడిశా

మంగళవారం । 1 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,10,379లు, బంగారం 150 మిల్లీగ్రాములు, వెండి 44.2 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కుటుంబాల్లో విషాదం

● రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు ఘటనల్లో 12మంది మృతి

- 8లో



ఒడిశాకు మరిన్ని సర్వీసులు

- 8లో

న్యూస్‌రీల్‌

భారీగా విదేశీ మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లతో నిందితుడు

బరంపురం: జిల్లా ఎక్సైజ్‌ విభాగం సోమవారం చేపట్టిన దాడుల్లో అక్రమంగా రవాణా చేస్తున్న విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. చమ్మఖండి పోలీస్‌ స్టేషన్‌ పరిధి బొనుగునాపల్లి గ్రామం నుంచి కారులో అక్రమంగా విదేశీ మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు బరంపురం-ఛత్రపూర్‌ మార్గంలో ప్రయాణిస్తున్న కారుపై దాడి చేశారు. ఇందులో భారీగా విదేశీ మద్యం పట్టుబడటంతో స్వాధీనం చేసుకున్నారు. కారుని సీజ్‌ చేసి, డ్రైవర్‌ సీమెచ్‌ మాణిక్‌ కుమార్‌ను అరెస్ట్‌ చేశామని అధికారులు తెలిపారు.

750కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితుడితో పోలీసులు

రాయగడ: గజపతి జిల్లా అడవా నుంచి లారీలో పశువుల దాణా బస్తాల మధ్యలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న 750కిలోల గంజాయిని పద్మపూర్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కెందుగుడ కూడలిలో ఆదివారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అడవా నుంచి రాయగడ వైపు పశువుల దాణా లోడ్‌తో వస్తున్న లారీని తనిఖీ చేయగా, 25 బస్తాల్లో గంజాయి పట్టుబడింది. దీనికి సంబంధించి మధ్యప్రదేశ్‌లోని ఇస్లామాపూర్‌కు చెందిన లారీ డ్రైవర్‌ ఇన్షాఫ్‌ అలీఖాన్‌(32)ను అరెస్ట్‌ చేశారు. వాహనంలో తరలిస్తున్న 120బస్తాల దాణా, వాహనం, 3సెల్‌ఫోన్లు సీజ్‌ చేశారు. నిందితుడుని సోమవారం ఉదయం కోర్టుకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయఘడ ఎక్సైజ్‌ ఎస్‌ఐకు సత్కారం



ఎస్‌ఐ కిశోర్‌చంద్రను అభినందిస్తున్న ఎస్పీ అభిరాం బెహరా

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్‌ ఎక్సైజ్‌ ఎస్‌ఐగా పని చేస్తున్న కిశోర్‌చంద్ర రథ్‌ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఎక్సైజ్‌ శాఖలో ఎస్‌ఐగా పనిచేస్తూ క్రీడాకారునిగా అనేక అవార్డులు, బహుమతులు పొందారు. రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో స్ప్రింటర్‌గా పాల్గొని విజయాలు సాధించారు. ఈ సందర్భంగా ఆయనను ఎక్సైజ్‌ ఎస్పీ అభిరాం బెహరా, ఇన్‌స్పెక్టర్లు ప్రబీర్‌ శామల్‌, సురేష్‌ మిశ్రా తదితరులు ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు.

మధుబాబు పింఛన్ల పంపిణీ

రాయగడ: జిల్లాలోని కొత్తగా మధుబాబు పింఛన్‌ మంజూరైన 90మంది లబ్ధిదారులకు రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక పింఛన్లు పంపిణీ చేశారు. సదర్‌ సమితి కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి బాటలు వేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, బీడీఓ లక్ష్మీనారాయణ సాబొతొ, సమితి చైర్మన్‌ టున్ని హుయిక, వైస్‌ చైర్మన్‌ హరప్రసాద్‌ హెప్రుక తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా.. కన్నీరు

అప్పటి వరకు ఆడుతూ.. పాడుతూ తిరుగాడిన చిన్నారులు తిరిగిరాని లోకాలకు పయనమయ్యారు. సరదాగా వాగులో స్నానానికి దిగి, దిగంతాలకు వెళ్లిపోయారు. వారి భవిష్యత్‌పై ఆయా కుటుంబాలు పెట్టుకున్న గంపెడు ఆశలను కల్వర్టు సమాధి చేసింది. దీంతో ఊరంతా విషాదంలో మునిగిపోయింది.

– రాయగడ



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు





ఉపారోసొజ్జ గ్రామం (ఇన్‌సెట్లో) ప్రమాదానికి కారణమైన కల్వర్టు

- నిర్మాణంలో ఉన్న కల్వర్టు సెంట్రింగ్‌ కూలడంతో ఐదుగురి మృతి
- కల్యాణ సింగుపూర్‌ సమితి ఉపారోసొజ్జ గ్రామంలో ఘటన
- మృతుల్లో నలుగురు చిన్నారులు
- ఇద్దరు కుమారులనూ కోల్పోవడంతో తల్లి ఆత్మహత్యాయత్నం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రి జగన్నాథ సరక

జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌ సమితి మజ్జిగుడ పంచాయతీ పరిధి ఉపారోసొజ్జ గ్రామంలో సోమవారం ఉదయం పెనువిషాదం చోటు చేసుకుంది. నిర్మాణ దశలో ఉన్న కల్వర్టుకు సంబంధించిన సెంట్రింగ్‌ కూలిపోవడంతో ఐదుగురు మృతిచెందారు. మృతుల్లో నలుగురు చిన్నారులు ఉన్నారు. తొలొసొజ్జ గ్రామం నుంచి సుమారు 8కిలోమీటర్ల దూరంలోని ఉపారొజొజ్జ గ్రామానికి ప్రధానమంత్రి సడక్‌ యోజన పథకంలో భాగంగా మూడేళ్ల క్రితం రూ.2.85 కోట్ల అంచనా రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సికరపాయి గ్రామానికి చెందిన ఈశ్వర్‌ గోపాల్‌శెట్టి అనే గుత్తేదారుకు పనులు అప్పగించారు. ఈ క్రమంలో ఉపారోసొజ్జ గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న వాగు వద్ద కల్వర్టు నిర్మించేందుకు ఏర్పాటు చేశారు. ఇందులో 3నెలల క్రితం సెంట్రింగ్‌ పనులు చేపట్టారు. అయితే ఎడతెరిపి లేని వర్షాలతో నిర్మాణం ముందుకు సాగలేదు.

ఎప్పటిలాగే స్నానానికి..

ఉపారోసొజ్జ గ్రామానికి చెందిన పిల్లలు, పెద్దలు వాగు వద్దే రోజూ స్నానాలు చేస్తుంటారు. సోమవారం ఉదయం లక్ష్మీధర్‌ మినియాక(53), అతని కుమారుడు ప్రిన్స్‌ మినియాక(4), రాజు మినియాక కుమారుడు చరణ్‌ మినియాక(8), సుమన్‌ మినియాక(5), రమేష్‌ కులిసిక కుమారుడు మనోజ్‌ కులిసిక(5) ఉదయం 9గంటలకు కల్వర్టు సమీపంలో స్నానం చేసేందుకు వాగులో దిగారు. అయితే కల్వర్టుకు సంబంధించిన సెంట్రింగ్‌ ఒక్కసారిగా వీరిపై పడిపోవడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందారు. అదే గ్రామానికి చెందిన అనిషా మినియాక(6) ఒడ్డుపై ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాడు. వెంటనే గ్రామంలోకి పరుగు తీసిన బాలుడు.. గ్రామస్తులకు విషయం తెలియజేయడంతో అంతా పరుగున ఘటనా స్థలానికి చేరుకున్నారు. మట్టి, కర్రలు తొలగించి అందులో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. అయితే అప్పటికే వారంతా ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న కల్యాణ సింగుపూర్‌ బీడీఓ సునీల్‌చంద్ర ఖొరా, తహసీల్దార్‌ సుధాకర్‌ రైతా, ఐఐసీ సుమతి మహతి, వైద్య సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని, సహాయక చర్యలు చేపట్టారు.

కాంట్రాక్టర్‌పై కేసు నమోదు..

ఉపారోసొజ్జ గ్రామంలో చోటు చేసుకున్న ప్రమాదానికి కాంట్రాక్టర్‌ ఈశ్వార్‌ గోపాల్‌ శెఠి నిర్లక్ష్యమే కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. 3నెలల క్రితం కల్వర్టు నిర్మాణానికి సంబంధించి సెంట్రింగ్‌ పనులు ప్రారంభించగా, రోజులు గడుస్తున్నా పూర్తి చేయకుండా వదిలేశారు. గత 3రోజులుగా కురుస్తున్న వర్షాలకు సెంట్రింగ్‌కు సంబంధించిన మట్టి, కర్రలు పూర్తిగా తడిసి, కూలిపోయాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పనులను ఈశ్వర్‌ కాకుండా మరో సబ్‌ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే నిర్మాణంలో నిర్లక్ష్యం కారణంగానే ఐదుగురు ప్రాణాలు కోల్పోవడంతో గుత్తేదారు ఈశ్వర్‌ గోపాల్‌శెఠిపై కేసు నమోదు చేశామని జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ వెల్లడించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఆయన.. పనుల తీరు, ప్రమాద వివరాలను స్వయంగా పర్యవేక్షించారు.

రూ.4 లక్షల చొప్పున ఆర్థికసాయం..

ఉపారోసొజ్జ గ్రామంలో చోటు చేసుకున్న విషాద ఘటన దురదృష్టకరమని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న హుటాహుటిన అక్కడికి బయలుదేరారు. అయితే తొలొసొజ్జ నుంచి ఉపారోసొజ్జ వరకు రోడ్డు పూర్తిగా బురదమయం కావడంతో దాదాపు 5కిలోమీటర్ల దూరంలోని గ్రామానికి కాలినడకనే చేరుకున్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఘటన వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫోన్‌ ద్వారా సమాచారం అందించారు. ఘటనపై స్పందించిన సీఎం నవీన్‌ పట్నాయక్‌.. కల్వర్టు ప్రమాదంలో మృతిచెందిన ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌దాస్‌, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదిలి ఘటనా స్థలానికి చేరుకొని, బాధిత కుటుంబాలను పరామర్శించారు. మానవతా దృక్పథంతో పార్టీ తరుపున ప్రమాదంలో మృతిచెందిన ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మంత్రి జగన్నాథ సరక, ఎమ్మెల్యే ముదులి

● ఎవరి కోసం బతకాలి..?



దిపాయిని చికిత్స నిమిత్తం తీసుకు వెళ్తున్న వైద్య సిబ్బంది, గ్రామస్తులు

ఘటనలో తన ఇద్దరు కుమారులను కోల్పోయిన దిపాయి మినియాక పురుగు మందు తాగి, ఆత్మహత్యకు యత్నించింది. అక్కడే ఉన్న వైద్య సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి, ప్రథమ చికిత్స అందించడంతో పాటు కల్యాణ సింగుపూర్‌ ఆస్పత్రికి తరలించడంతో ఆమె ప్రాణాలతో బయట పడింది. దిపాయి భర్త గత మూడు ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంయి తన ఇద్దరు కుమారులు సుమన్‌ మినియాక(8), చరణ్‌ మినియాక(4) లను కంటికి రెప్పలా కాపాడుకుని జీవిస్తోంది. కల్వర్టు వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఇద్దరు పిల్లలూ మృతి చెందారని తెలుసుకున్న ఆమె.. మనస్థాపానికి గురై వెంటనే ఇంట్లోని పురుగు మందు తాగింది. 'ఇద్దరు కోడుకులు లేరు. ఇక నేను ఉండీ ఏం ప్రయోజనం. ఇంక ఎవరి కోసం బతకాల'ని రోధించింది. గమనించిన గ్రామస్తులు అక్కడే ఉన్న వైద్య సిబ్బందికి విషయాన్ని తెలియజేశారు. సకాలంలో స్పందించడంతో ఆమె ప్రాణాలు దక్కాయి.

● ఎన్నో ఆశలు పెట్టుకున్నా..



రమేష్‌ కులిసిక

పుట్టుకతోనే దివ్యాంగుడిని కావడంతో ఒక్కగానొక్క కుమారుడిని ఉన్నతంగా చదివించాలన్న ఆశలు అడియాశలయ్యాయని గ్రామానికి చెందిన రమేష్‌ కులసిక కన్నీటి పర్యంతమయ్యాడు. కల్వర్టు ప్రమాదంలో ఆయన కుమారుడు మనోజ్‌ కులసిక(5) మృతిచెందాడు. ఆదివారం సాయంత్రం తోటి స్నేహితులతో కలిసి కల్వర్టు సమీపంలోనే చేపలు పట్టి ఇంటికి తీసుకు రావడంతో పాటు వండి పెట్టమని అడిగాడని తెలిపాడు. సోమవారం ఉదయం చేపల కూర తిని స్నానానికి వెళ్లిన తన కొడుకు తిరిగి రాలేదని విలపించాడు. కొడుకుపైనే ఎన్నో ఆశలు పెట్టుకుని జీవిస్తున్నానని, ఇలా జరుగుతుందని ఊహించలేదని వాపోయాడు.

● తండ్రి, తమ్ముడిని కోల్పోయి..

తమను అల్లారు ముద్దుగా చూస్తున్న తండ్రి, తమ్ముడు ప్రిన్స్‌ మినియాను కోల్పోవడంతో తామంతా దిక్కులేని వారమయ్యామని లక్ష్మీధర్‌ మినియాక కుమార్తె మధుస్మిత, దేవాసిని, మరో కుమారుడు మానస్‌ మినియాక కన్నీరు మున్నీరయ్యారు. తొలొసొజ్జ గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న తాము తండ్రి, తమ్ముడు మృతి చెందారన్న వార్త విని తట్టుకోలేక పోయామన్నారు. ఇక తమ చదువులు ఎలా సాగుతాయని భవిష్యత్‌పై ఆందోళన వ్యక్తంచేశారు.



రోధిస్తున్న లక్ష్మీధర్‌ కుమార్తె, కుమారుడు

ఒడిశా సివిల్స్‌ ఫలితాలు వెల్లడి

● రాష్ట్ర టాపర్‌గా సుదేవ్‌కుమార్‌ పృష్టి

భువనేశ్వర్‌: ఒడిశా పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌(ఓపీఎస్‌సీ) నిర్వహించిన ఒడిశా సివిల్‌ సర్వీసెస్‌(ఓసీఎస్‌) పరీక్షలు–2021 ఫలితాలను సోమవారం ప్రకటించింది. ఉత్తీర్ణుల జాబితాలో సుదేవ్‌కుమార్‌ పృష్టి అగ్రస్థానంలో నిలిచాడు. తొలి 10 ఉత్తమ ఉత్తీర్ణుల జాబితాలో చెరో సగం స్థానాలు యువతీ, యువకులు సాధించడం విశేషం. ఈ పరీక్షల్లో సాధించిన ఉన్నత మార్కుల క్రమంలో 432మంది అభ్యర్థులకు ఒడిశా సివిల్‌ సర్వీసెస్‌(గ్రూప్‌–ఏ, బీ)–2021 కింద వచ్చే ఉద్యోగాల్లో నియామకానికి ఓపీఎస్‌సీ సిఫార్సు చేసింది. ఇందులో 164మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. మహిళల సమగ్ర ఉత్తీర్ణత 38శాతంగా నమోదైంది. 2023 ఫిబ్రవరి 21నుంచి మార్చి 18వరకు జరిగిన ప్రధాన(రాత) పరీక్ష, జూలై 15నుంచి 25వ వరకు జరిగిన ఇంటర్వ్యూ ఆధారంగా కమిషన్‌ అభ్యర్థులను సిఫార్సు చేసింది. ఇందులో ఓపెన్‌ కేటగిరీలో 229(మహిళలు–91), ఎస్‌ఈబీసీ–39 (మహిళలు–12), ఎస్సీ–71(మహిళలు–27), ఎస్టీ–93(మహిళలు–34), ఎక్స్‌ సర్వీస్‌మన్‌–08, క్రీడాకారులు–1, దివ్యాంగులు–10 మంది ఉన్నారు. ఈ పరీక్షలకు 58,241 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వీరిలో 20,930 మంది మహిళలు. 2022 అక్టోబరు 16న జరిగిన ప్రిలిమినరీ పరీక్షకు 29,295 మంది హాజరయ్యారు. ఈ దశ ఉత్తీర్ణులైన 5,296 మందిలో 1,749మంది స్థానం దక్కించుకున్నారు. 2023 ఫిబ్రవరి 21నుంచి మార్చి 18వరకు జరిగిన మెయిన్స్‌ పరీక్షకు హాజరైన 4,430మంది అభ్యర్థుల్లో 871మందిని కటక్‌ కమిషన్‌ కార్యాలయంలో జూలై 15నుంచి 25వరకు నిర్వహించిన విద్యార్హత పత్రాల పరిశీలన, ఇంటర్వ్యూలకు పిలిచారు.

సమితి సభ్యులకు అప్పగించడం సరికాదు

● పంచాయతీ ప్రత్యేక నిధుల కేటాయింపుపై సర్పంచ్‌ల అభ్యంతరం



బీడీఓ రాజీవ్‌ దాస్‌తో చర్చిస్తున్న సర్పంచ్‌లు

జయపురం: రాష్ట్రంలోని ప్రతి పంచాయతీ అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 లక్షల నిధుల సద్వినియోగంపై ప్రణాళికా సమావేశం సోమవారం నిర్వహించారు. జయపురం సమితి సభా గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్‌ సభ్యులు, సమితి సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు పంచాయతీల్లో ఏ అభివృద్ధి పథకం చేపట్టాలన్నా ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనల మేరకే జరిగేవని, అయితే నిబంధనలు మార్చడంపై బీడీఓ రాజీవ్‌ దాస్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వం మంజూరు చేయనున్న నిధుల్లో రూ.10 లక్షలు సర్పంచ్‌లు, మరో రూ.10 లక్షలు సమితి సభ్యులు, మిగతా రూ.5 లక్షలకు సంబంధించి జిల్లా పరిషత్‌ సభ్యులు ప్రతిపాదనలు పంపించాలని చెప్పడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. మిగతా రూ.25 లక్షలకు ప్రణాళికను సమితి తయారు చేయాలని నిర్ణయించాలనే నిర్ణయాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నామని సర్పంచ్‌లు వెల్లడించారు. ఈ విషయంలో స్పష్టత ఇవ్వకపోతే కలెక్టర్‌ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. దీనిపై స్పందించిన ఆయన.. 2, 3 రోజుల్లో ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఈ నిధులతో ప్రార్థనా మందిరాలు, చెరువుల అభివృద్ధి, క్రీడా సామగ్రి కొనుగోలు, ఆటస్థలాల్లో సౌకర్యాలు కల్పించడం, పాఠశాలలు, అంగన్‌వాడీ, మిషన్‌శక్తి భవనాలకు మరమ్మతులు, ఇంటర్‌నెట్‌ వ్యవస్థ కల్పించడం తదితర పనులు చేపట్టాలని వివరించారు

విజిలెన్స్‌ వలలో టీడీసీఈ ఓఎల్‌ జీఎం

● రూ.5.54 లక్షలతో పట్టుబడిన అధికారి



విజిలెన్స్‌ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు



రోహిత్‌ పరిడా

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్‌.ఉదయగిరి బ్లాక్‌లో గిరిజనాభివృద్ధి కోపరేటివ్‌ కార్పొరేషన్‌(టీడీసీఈఓఎల్‌)లో ఓఎస్‌డీ జనరల్‌ మేనేజరుగా విధులు నిర్వహిస్తున్న రోహిత్‌కుమార్‌ పరిడా భువనేశ్వర్‌కు బస్సులో వెళ్తుండగా చంద్రగిరి వద్ద విజిలెన్స్‌ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద ఉన్న బ్యాగులో రూ.5.54 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఆయనను ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకపోవడంతో నగదును సీజ్‌ చేశారు. రోహిత్‌ పరిడా ఆర్‌.ఉదయగిరి గిరిజనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్‌లో జీఎంగా ఉండగా అనేక అవినీతి అభియోగాలు నమోదయ్యాయని విజిలెన్స్‌ ఎస్పీ(బరంపురం) తెలిపారు. కొంతకాలం విధుల నుంచి తొలగించిన అనంతరం తిరిగి కాంట్రాక్టు ప్రాదిపదికన(ఓఎస్‌డీ)గా కొనసాగుతున్నారని వెల్లడించారు. మరోవైపు విజిలెన్స్‌ అధికారులు భువనేశ్వర్‌, ఆర్‌.ఉదయగిరి, బరంపురంలో రోహిత్‌ పరిడాకు చెందిన ఇళ్లు, బంధువుల నివాసాల్లో దాడులు జరిపారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు అందాల్సి ఉంది.

జల దిగ్బంధంలో రాజధాని



నగరంలో ఏరులై పారుతున్న వర్షపు నీరు



జల దిగ్బంధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న బీఎంసీ కమిషనర్‌

భువనేశ్వర్‌: రాష్ట్ర రాజధాని నగరంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. మధ్యాహ్నం నుంచి మెరుపులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కారణంగా నగర జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు ప్రాంతాల్లో మోకాళ్లలోతు వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా పాతబస్తీ, నయాపల్లి, లక్ష్మీసాగర్‌, రసూల్‌గడ్‌, ఆచార్య విహార్‌, సత్యనగర్‌ ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే రానున్న రెండు రోజుల్లో జంట నగరాలు భువనేశ్వర్‌–కటక్‌ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) అంచనా వేసింది. మరోవైపు ప్రభావిత ప్రాంతాల్లో బీఎంసీ కమిషనర్‌, కార్పొరేటర్ల బృందం నగరంలో జల దిగ్బంధంలో చికుకున్న ప్రాంతాలను ప్రత్యక్షంగా సందర్శించారు. నీటి తొలగింపు కోసం సన్నాహాలు చేపట్టారు.

దోపిడీ విఫలం



పోలీసుల అదుపులో నిందితులు

● తుపాకీ, నాటు బాంబులు స్వాధీనం



సీజ్‌ చేసిన నాటు బాంబులు

బరంపురం: గంజాం జిల్లా కుదలా పట్టణం సమీపంలోని జుంకులిపడా గ్రామంలో దోపిడీకి సిద్ధమవుతున్న ముగ్గురు దుండగులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. వారి నుంచి తుపాకీ, తూటాలతో పాటు 5 నాటు బాంబులను సీజ్‌ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను కొదలా పోలీసు స్టేషన్‌ ఐఐసీ అధికారి ప్రశాంత్‌కుమార్‌ సాహు సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి జుంకులిపడా గ్రామంలో సిబ్బంది పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న సమయంలో ఐదుగురు దుండగులు దోపిడీకి వ్యూహం పన్నుతున్నారు. అనుమానాస్పదంగా వ్యవహరించడం, మారణాయుధాలు కలిగి ఉండటంతో వెంటనే వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా, అసలు విషయం బయట పడింది. దీనికి సంబంధించి నిందితులను అరెస్ట్‌ చేశారు. వారి నుంచి నాటు తుపాకీ, పేలని తూటాలు, 5 నాటుబాంబులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచిన అనంతరం సబ్‌ జైలుకు తరలించామన్నారు. దీనిపై ఇతర ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

క్లుప్తంగా

డిగ్రీ 2, 4 సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ అనుబంధ కళాశాలల 2, 4 సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 17వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటల పరీక్షలు నిర్వహిస్తున్నారు. వర్సిటీ పరిధిలో 64 కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలను విద్యాశాఖాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పోర్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: మూలపేట పోర్టు నిర్వాసితుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం మూలపేట గ్రామానికి వచ్చి నిర్వాసితులతో ఆయన మాట్లాడారు. జీడిమొక్కలు, పీడీఎఫ్ పరిహారం చెల్లించాలని నిర్వాసితులు కోరారు. అలాగే ఆర్అండ్ఆర్‌కాలనీలో బోర్లు వేసినా నీరు పడటంలేదని, రోడ్లు బాగు చేయాలని ఎమ్మెల్సీకి విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈయనతో సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఎస్పీ భరత్‌చంద్రరెడ్డి ఉన్నారు.

'డిలీషన్‌కు డాక్యుమెంట్లు తప్పనిసరి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతి డిలీషన్‌కి సంబంధిత డాక్యుమెంట్స్ తప్పకుండా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఆయన సోమవారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూలై 21న కుటుంబాల సర్వే ప్రారంభమైందని, ఇప్పటివరకు చేపట్టిన సర్వేపై సమీక్షించారు. ఓటరు జాబితాలో తొలగించడం, జత చేయడం జరుగుతుందని అందుకు సంబంధించి ప్రతి ఒక్క దరఖాస్తుకి సంబంధించి డాక్యుమెంట్లు అన్నీ అప్‌లోడ్ చేయాలన్నారు. సంతకాలు లేకుండా ఫారాలు అప్‌లోడ్ చేయకూడదన్నారు. ఆగస్టు 21 నాటికి వందశాతం సర్వే పూర్తి కావాలన్నారు. ఈ సర్వేకు వలంటీర్లు వెళ్లకూడదని అన్నారు.

ముగిసిన సేవాదళ్ శిక్షణ శిబిరాలు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి బాబా కొలువైన ప్రశాంత నిలయంలో సేవలకు వెళ్లే సేవాదళ్‌కు విధివిధానాలు తెలియజేసేందుకు నిర్వహించిన శిక్షణ శిబిరాలు ఆరు జోన్లలో ముగిశాయని జిల్లా సేవాదళ్ సమన్వయకర్త సూర రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోంపేట, పలాస, హిరమండలం, శ్రీకాకుళం, నరసన్నపేట జోనల్‌లో శిక్షణలు ముగిసినట్టు పేర్కొన్నారు. పాతపట్నం, టెక్కలి జోన్లలో ఆగస్టు ఆరో తేదీ ప్రారంభమవుతాయని వెల్లడించారు. పుట్టపర్తికి దేశ విదేశాలనుంచి వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సేవలు అందించేందుకు సేవాదళ్ ఏర్పడిందన్నారు. జిల్లానుంచి అధికమంది భక్తులకు శిక్షణ ఇచ్చి సేవాదళ్‌గా రూపొందించామన్నారు. వీరిని ప్రశాంతి నిలయం సేవలకు ఏటా ఆరు పర్యాయాలు పంపిస్తామన్నారు.

శ్రీకాకుళం వాసి దారుణ హత్య

- కత్తితో గొంతు కోసి చంపేసిన వైనం
- సహచర కార్మికులపైనే అనుమానాలు


మాధవరావు మృతదేహం

రాంబిల్లి (అనకాపల్లి జిల్లా): కొత్తపేటలో దారుణహత్య చోటుచేసుకుంది. శ్రీకాకుళానికి చెందిన లోపింటి మాధవరావు (23)ను పీక కోసి హత్య చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు. నేవల్ బేస్‌లో నిర్మాణ పనులు చేస్తున్న ఎల్ అండ్ టీ సంస్థలో కాంట్రాక్టర్ నారాయణ వద్ద మాధవరావు గత కొన్నాళ్లుగా పనిచేస్తున్నాడు. అక్కడే పరిచయమైన మరో ఐదుగురు కార్మికులతో కలిసి కొత్తపేటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. మాధవరావు మరణానికి దారితీసిన పరిస్థితులు ఇంకా తెలియరాలేదు. కాంట్రాక్టర్ నారాయణ ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం డీఎస్పీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ గఫూర్, ఎస్ఐ దీనబంధు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించగా, ఒక కార్మికుడి వైపు వెళ్లినట్లు తెలిసింది. దీంతో అదే రూంలో ఉంటున్న ఐదుగురు కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ దీనబంధు తెలిపారు.

ఉలిక్కిపడ్డ కొత్తపేట

రక్తపు మడుగులో మాధవరావు మృతదేహం పడి వుండటం, హత్య జరిగిన ప్రదేశంలో పొడవైన కత్తి దొరకడంతో కొత్తపేటలో భయానక వాతావరణం చోటు చేసుకుంది. మండల వ్యాప్తంగా ఈ వార్త దావానలంలా వ్యాపించింది. వారం రోజుల క్రితం కొత్తపేటలో ఒక కార్మికుడిని మరో కార్మికుడు చాకుతో కడుపులో పేగు బయటకు వచ్చేలా పొడిచిన విషయం తెలిసిందే.

కుటుంబాల్లో విషాదం

- రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు ఘటనల్లో 12మంది మృతి
- క్యాపిటల్ ఆస్పత్రిలో డెంగీతో ప్రాణాలు కోల్పోయిన గర్భిణి


జవాన్ సునీల్‌కుమార్ రావు


రాజేష్(ఫైల్‌ఫోటో)


అంబులెన్స్‌లో మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఘటనల్లో 12మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో పిడుగుపాటుకు ఆరుగురు మృతి చెందడం విషాదాన్ని మిగిల్చింది. వివరాల్లోకి వెళ్తే... మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి పంగం వద్ద 326 జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్ని ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మృతుల్లో ఒకరు డీవీఎఫ్ జవాన్‌గా గుర్తించారు. మత్తిలి సమితి పంగం గ్రామానికి డీవీఎఫ్ సునీల్‌కుమార్ రావు, రాజేష్‌కుమార్ హిరువా స్నేహితులు. ఇరువురూ బైక్‌పై మత్తిలి వచ్చి, ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో సునీల్ అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్ర గాయాలపాలైన రాజేస్ మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ప్రాణలు కోల్పోయాడు. ఐఐసీ రంజాన్ కుమార్ మాఝి ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనతో పంగం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, మత్తిలి సమితి అధ్యక్షుడు మహేష్ బక్క బాధిత కుటుంబాలను పరామర్శించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృత్యువులోనూ విడని స్నేహమంటూ కన్నీరు కర్చారు. పోలీసుల సమక్షలో ఇరువురికీ అంత్యక్రియలు నిర్వహించారు.

దుక్కి దున్నుతూ..


ప్రమాద స్థలంలో బోల్తా పడి ఉన్న ట్రాక్టర్

జయపురం: పొలంలో దుక్కి దున్నుతూ ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ప్రతాప్ బెహరా కుమారుడు డ్రైవర్ హిమాంశు బెహరా(32) మృతిచెందాడు. కొట్‌పాడ్ సమితి తమనహండి పంచాయతీ గాంధీ నగర్ గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొట్‌పాడ్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మినీ దియాన్ బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. అంత్యక్రియలకు అవసరమైన ఆర్థికసాయం రెడ్‌క్రాస్ నిధి నుంచి అందించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. వెంటనే రెవెన్యూ సిబ్బంది రూ.10 వేలను అందజేశారు.

పిడుగుపాటుకు ఆరుగురు..

భువనేశ్వర్: రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో పిడుగుపాటుకు ఆరుగురు మృతిచెందారు. పూరీ జిల్లా పిప్పిలి పోలీసు ఠాణా దొండొ ముకుందపూర్ ప్రాంతం బహబాజాపూర్‌లో పిడుగుపాటుకు ఒక మహిళ మరణించగా, సుందర్‌గడ్ జిల్లా బొణై మండలం ఘోసర గ్రామంలో ఓ బాలిక మృతిచెందింది. కెంజొహర్ జిల్లా ఆనందపూర్ సబ్ డివిజన్ పరిధిలోని హతొడిహి వద్ద పొలంలో పని చేస్తుండగా రైతు, ఖుర్దా జిల్లా బంకి డొంపాడా మండలం పరిధిలోని పదమ్‌పూర్ గ్రామంలో మరో రైతు పిడుగుపాటుకు ప్రాణాలు కోల్పోయారు. చిలికా సరస్సులోని కలిజుగేశ్వర్ కొండ సమీపంలో పిడుగుపాటుకు ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. తండ్రీ కొడుకులైన వీరిరువురూ చేపల వేటకు వెళ్లి మృతిచెందారు. చిలికా ప్రాంతం శాంతినగర్‌లో ఉంటున్న తండ్రి విధాన్ బిశ్వాస్(60), కుమారుడు ఉత్తమ్ బిశ్వాస్(32)గా గుర్తించారు. ఆదివారం రాత్రి తమ పడవలో చేపలు పట్టేందుకు చిలికా సరస్సులోకి వెళ్లిన సమయంలో పిడుగు పడింది. సోమవారం తెల్లవారినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు గాలింపు చేపట్టడంతో మరణ వార్త ధ్రువీకరించారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ..


కలిమెల ఆరోగ్య కేంద్రంలో కమా మాఢి మృతదేహం

మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి తరణి వీధిలో నివాసం ఉంటున్న కమా మాఢి(19) సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి, మాట్లాడుతూ విద్యుత్ షాక్‌కు గురై, మృతిచెందాడు. కలిమెల గోపబంధు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న కమా.. తన రూమ్‌లో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి, ఫోన్ మాట్లాడుతున్నాడు. అయితే అకస్మాతుగా స్పృహ కోల్పోయి ఉండటంతో తోటి స్నేహితులు కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకున్నారు. ఫోన్ మాట్లాడుతూ విద్యుత్ షాక్‌కు గురైనట్లు పోస్టుమార్టం అనంతరం వైద్యులు ధ్రువీకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి వ్యక్తి..


చెరువులో రామ మృతదేహం

కలిమెల సమితి తేల్రాయి పంచాయతీ పొడావాడ గ్రామానికి చెందిన రైతు రామ మడియామి(50) చెరువులో మునిగి మృతిచెందాడు. తన భార్య నందే మడియామి, తల్లి గంగ, మేనల్లుడు భీమా కవాసి, ఆయన భార్య గంగి కలిసి తమ పొలంలో పనికి వెళ్లారు. పని ముగించుకొని వస్తున్న సమయంలో స్నానం చేసేందుకు సమీపంలోని చెరువులో దిగిన రామ.. ప్రమాదావశాత్తు జారి పడి మృతిచెందాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో చెరువు వద్దకు వెళ్లిన భీమా, గట్టుపై బట్టలు, చెప్పులు ఉన్నట్లు గుర్తించి, ఎంవీ-79 గ్రామం వద్ద పోలీసులకు సమాచారం అందించారు. ఓడ్రాఫ్ బృందం సాయంతో చెరువులో గాలించి, మృతదేహాన్ని బయటకు తీశారు. కలిమెల ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మంగళవారం ఉదయం మృతదేహాన్ని అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

రెండో డెంగీ మృతి..

భువనేశ్వర్: రాజధాని నగరంలో రెండో డెంగీ మృతి నమోదైంది. భద్రక్‌కు చెందిన షర్మిష్ఠ సేనాపతి వీఎస్ఎస్ నగర్‌లో నివాసంలో ఉంటోంది. క్యాపిటల్ ఆస్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చిన వారం రోజులకే చికిత్స పొందుతూ చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. బిడ్డ ఆరోగ్యంగా ఉందన్నారు. పురిటి నొప్పులతో జూలై 21న ఆస్పత్రిలో చేరిన ఆమె.. 23న ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవ సమయంలో ఆరోగ్య పరిస్థితి సాధారణంగా ఉండగా, 25న జ్వరం, వాంతులతో అస్వస్థతకు గురైంది. దీంతో ఇతర పరీక్షలతో పాటు డెంగీ పరీక్షలు కూడా చేశారు. పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వెంటనే ఐసీయూలో చేర్చారు. క్రమంగా ఆమె ఆరోగ్యం క్షీణించి, సోమవారం మధ్యాహ్నం మరణించింది. భువనేశ్వర్ నగరపాలక సంస్థ(బీఎంసీ) నయాపల్లి, జయదేవ్ విహార్, పాతబస్తీ, జొగొమొరా, వంటి ప్రాంతాలను డెంగీ హాట్‌స్పాట్‌లుగా గుర్తించింది. ఈ ప్రాంతాల్లో డెంగీ నివారణ కార్యక్రమాలు నిరవధికంగా నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వీఎస్ఎస్ నగర్ నివాసి డెంగీతో మరణించడం పట్ల బీఎంసీ విచారం వ్యక్తం చేసింది. ఈ ప్రాంతంలో డెంగీ పట్ల అవగాహనతో దోమల నివారణ మందు పిచికారీ చేయడం ప్రారంభించారు. 'ఘర్ ఘర్ అభియాన్'లో అవగాహన కార్యక్రమాల్లో వైద్యులు ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. సంబంధిత ప్రాంతంలో పరిస్థితిని పరిశీలించేందుకు వీఎస్ఎస్ ప్రత్యేక బృందం మంగళ వారం పర్యటించనుంది. డెంగీ కేసుల సంఖ్య నానాటికీ పెరుగుతుండటం గమనార్హం. గత 24 గంటల్లో 50 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం క్యాపిటల్ ఆస్పత్రిలో 41మంది డెంగీ రోగులు చికిత్స పొందుతున్నారు. సోమవారం తాజాగా నలుగురు బాధితులు చేరారు.

ఆధ్యాత్మిక శోభ


కాలి నడకన ధవలేశ్వర్ చేరుకుంటున్న భక్తులు

బరంపురం: శ్రావణమాసం చివరి సోమవారం పురస్కరించుకొని భక్తులు బోల్‌భం దీక్షలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

జిల్లాలోని నదీ తీరాల నుంచి కావడిలో పవిత్ర జలాలను సేకరించి, కాలి నడకన శివాలయాలకు చేరుకున్నారు. అనంతరం పరమ శివునికి జలాలతో అభిషేకం జరిపారు. దీంతో శివాలయాలన్నీ శివనామ స్మరణతో కిక్కిరిసాయి. పలువురు మహిళలు కావిడి చేతపట్టి, కాలినడకన ధవలేశ్వర్ శివాలయానికి చేరుకొని నదీ జలాలతో అభిషేకం చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మి శోభ సంతరించుకుంది.

ఆదిత్యుని దర్శనానికి వచ్చి..


రోడ్డు మీదే కుప్పకూలిన విశాఖ వాసి

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా విశాఖపట్నానికి చెందిన ఓ వృద్ధుడు అనారోగ్యంతో సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం విశాఖపట్నం ప్రహ్లాదపురానికి చెందిన 67 ఏళ్ల వృద్ధుడు ఏఎస్ఎన్ మూర్తి అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి నగరానికి వచ్చాడు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణానికి శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరాడు. ఒక్కసారిగా వాంతులు కావడంతో రోడ్డు మీదనే కుప్పకూలిపోయాడు. ఈ విషయమై రెండో పట్టణ సీఐ శ్రీనివాసరావును వివరణ అడగ్గా ఇది సహజ మరణమని, మృతుని కుమార్తె, బంధువులు రావడంతో మృతదేహాన్ని అప్పగించామని తెలిపారు.

పరీక్షల పర్వం ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: కొత్త విద్యా సంవత్సరంలో పరీక్షల పర్వం మొదలుకానుంది. జూన్, జూలై మాసాల్లో జరిగిన సిలబస్‌లకు సంబంధించి విద్యార్థుల అభ్యసన మదింపు, సామర్థ్యాలను అంచనా వేసేందుకు విద్యాశాఖ సన్నద్ధమైంది. ఆగస్టు 1వ తేదీ నుంచి పాఠశాలల్లో పరీక్షలు మొదలుకానున్నాయి. గుణాత్మక విద్యను అందించేందుకు నిర్వహిస్తున్న ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలను ప్రభుత్వం గత ఏడాది నుంచి ప్రయోగాత్మకంగా క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ (సీబీఏ) పేరుతో నిర్వహిన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రస్తుత విద్యా సంవత్సరంలో 4 ఫార్మేటివ్, 2 సమ్మేటివ్ పరీక్షల నిర్వహణకు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) ఏర్పాట్లు చేసింది. గత ఏడాది మాదిరిగానే 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సీబీఏ విధానంలో, 9,10 తరగతుల వారికి ఫార్మేటివ్ విధానంలో పరీక్షలు జరగనున్నాయి. సీబీఏ విధానంలో నిర్వహించే పరీక్షలు ఆగస్టు 1 నుంచి 5వ తేదీ వరకూ నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇప్పటికే విడుదల చేశారు.

'ద్విభాషా' విధానంలో ప్రశ్నపత్రాలు..

సీబీఏ విధానంలో నిర్వహిస్తున్న పరీక్షలకు విద్యార్థులకు ప్రశ్నపత్రం సులువుగా అర్థమయ్యేందుకు బైలింగ్వెల్ (ద్విభాష) విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. విద్యార్థికి ఇంగ్లీషులో ప్రశ్న అర్థం కాకుంటే తెలుగులో చదివి అర్థం చేసుకునేందుకు గత ఏడాది నుంచి ద్విభాషా విధానంలో ప్రశ్నపత్రాలు ప్రవేశపెట్టారు. ఇందులో 10 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో, ఐదు ప్రశ్నలు రాతపూర్వక విధానంలో ఇస్తారు. మొత్తం 15 ప్రశ్నలకు 20 మార్కులు కేటాయిస్తారు. ప్రశ్నలన్నీ విద్యార్థి మేథస్సును సమగ్రంగా అంచనా వేసేలా ఉంటాయి. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాల్సి ఉంటుంది.

మృత్యుంజయుడు!

- చెరువులో మునిగిపోయిన బాలుడు
- కాపాడిన యువకులు


చికిత్స పొందుతున్న రాహుల్


బాలుడిని కాపాడిన యువకులు

కోటబొమ్మాళి: చెరువులో మునిగిపోయిన బాలుడ్ని ఇద్దరు యువకులు కాపాడి ప్రాణభిక్ష పెట్టారు. అయితే ఆ బాలుడు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. కోటబొమ్మాళి రెడ్డిక వీధికి చెందిన చాప ఆసిక్, రాములమ్మ కుమారుడు రాహుల్ (5) రాహుల్ స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాలకు వెళ్లిన రాహుల్ సాయంత్రం ఇంటికి వచ్చాడు. తలిదండ్రులు పొలం పనులకు వెళ్లిపోవడంత తోటి పిల్లలతో కలిసి అయ్యప్పగుడి వద్ద ఉన్న యరకయ్య చెరువులో స్నానానికి దిగాడు. ఇటీవల ఉపాధిహామీ పనులు చేపట్టడంతో చెరువులో నీరునిండుగా ఉండటంతో ఈత రాక మునిగిపోయాడు. ఆ సమయంలో చెరువు వద్ద పెద్దవారు ఎవరూ లేకపోవడంతో ఆందోళన చెందిన తోటి పిల్లలు కేకలు వేస్తూ గ్రామంలోకి వెళ్లి విషయాన్ని చెప్పారు. ఇంతలో అటుగా వస్తున్న యువకులు నందిక అజయ్ కుమార్, కమ్మకట్ల సురేష్‌రెడ్డి విషయం తెలుసుకొని చెరువులోకి దూకి మునిగిపోయిన రాహుల్‌ను ఒడ్డుకు చేర్చారు. అప్పటికే కొనఊపిరితో అపస్మారక స్థితికి చేరిన రాహుల్‌ను ద్విచక్ర వాహనంపై స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యుడు పరిస్థితి చేయి దాటిపోయిందని.. తాను చికిత్సచేయలేనని తేల్చి చెప్పేశారు. దీంతో వెంటనే కోటబొమ్మాళిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యసిబ్బంది స్పందించి చికిత్స ప్రారంభించారు. ఆక్సిజన్ పెట్టారు. శరీరఉష్ణోగ్రత తగ్గిపోవడంతో కాళ్లు, చేతులు, శరీరంపైనా గట్టిగాపామునూ సపర్యాలు చేయడంతో రాహుల్ మెలుకవలోకి వచ్చాడు. అనంతరం మెరుగైన చికిత్సకోసం 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. బాలుడిని కాపాడిన యువకులను స్థానికులు అభినందించారు.

మానవత్వం పరిమళించిన వేళ..

- అనాథ శవానికి అంత్యక్రియలు


అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రామారావు

ఇచ్ఛాపురం: అనాథ శవానికి పట్టణ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ తెల్లి రామారావు, స్థానిక యువత కలిసి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. సుమారు 34 ఏళ్ల మతిస్థిమితం లేని వ్యక్తి పట్టణంలో సంతపేట వద్ద ఉంటుండేవాడు. ఈయన సోమవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు పట్టణ పోలీసుస్టేషన్ ఎస్సై కె.గోవిందరావుకు తెలియజేశారు. పరిశీలించిన ఆయన కేసు నమోదు చేశారు. అయితే చనిపోయిన వ్యక్తి అనాధ కావడంతో దహన సంస్కారాలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ రామారావు.. స్థానిక యువకులు డి.రాజు, నాగరాజు తదితరుల సహకారంతో మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించి హిందూ సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు పూర్తి చేశారు. హెచ్‌సీని పట్టణ ఎస్సై, పోలీసులు అభినందించారు.

హత్య కేసులో నలుగురికి పదేళ్ల జైలు శిక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: హత్య కేసులో రాజాంకు చెందిన నలుగురికి పదేళ్ల కఠిన కారాగార శిక్షను న్యాయస్థానం విధించింది. రాజాంలో 2018 సెప్టెంబర్ 17వ తేదీన కొండేటి అప్పారావు (65)పై అదే గ్రామానికి చెందిన కొండేటి పోలీస్, కొండేటి రమణ, చిన్నారావు, కొండేటి గౌరి, కొండేటి సుశీల దాడికి తెగబడ్డారు. ఈ దాడిపై మృతుడి బంధువులు కనకరాజు, మహేశ్వరరావులు ఫిర్యాదు చేశా రు. దాడి అనంతరం అప్పారావు చికిత్స పొంది తూ మృతిచెందారు. దీంతో ఈ ఐదుగురిపై రాజాం పోలీసులు కేసును నమోదు చేసి, దర్యాప్తు చేశారు. కోర్టులో హాజరు పరచగా చావుకు ఐదుగురు బాధ్యులని రుజువు కావడంతో కొండేటి రమణ, కొండేటి చిన్నారావు, కొండేటి గౌరి, కొండేటి సుశీలకు పదేళ్ల కఠిన కారాగార శిక్షను మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి బి.భాస్కరరావు తీర్పునిచ్చారు. మరో ముద్దాయి కొండేటి పోలీసు ఇటీవల మృతి చెందారు. దీంతో నలుగురికి శిక్ష ఖరారు చేశారు. జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్షను అమలు చేయాలని తెలిపారు. అలాగే వేర్వేరు సెక్షన్ల కింద ఈ నలుగురికే మరో రెండేసి సంవత్సరాల పాటు కారాగార శిక్ష వేశారు. ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అమలు చేయాలని తీర్పునిచ్చారు. ఈ కేసు దర్యాప్తు రాజాం సీఐ వేణుకుమార్, వేణుగోపాలరావు చేయగా, ఫ్యామిలీ కోర్టు పీపీ వాన కృష్ణ చంద్ వాదించారు.

ఒడిశాకు మరిన్ని సర్వీసులు!

- కొత్తగా విశాఖ నుంచి ఏడు బస్సులు
- ఇకపై అక్కడ నైట్ హాల్టులకూ వీలు
- ట్యాక్స్, పర్మిట్ల భారం నుంచి వెసులుబాటు
- ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన కొత్త ఒప్పందం


అల్ట్రా డీలక్స్ బస్సు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం నుంచి ఒడిశాకు ఆర్టీసీ సర్వీసులు మరిన్ని పెరగనున్నాయి. ప్రస్తుతం ఇక్కడ నుంచి ఆ రాష్ట్రానికి 14 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఇకపై కొత్తగా మరో ఏడు బస్సులను ప్రవేశపెట్టేందుకు ఏపీఎస్ఆర్టీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య కుదిరిన ఒప్పందంతో బస్సుల సంఖ్య పెంచేందుకు వీలవుతోంది. దీంతో ఒడిశాలోని జైపూర్, నవరంగ్‌పూర్, ఒనకఢిల్లీ, పర్లాకిమిడిలకు ఒక్కోటి చొప్పున, గుణుపూర్‌కు మూడు బస్సులను కొత్తగా నడపనున్నారు. ప్రస్తుతం గుణుపూర్‌కు మూడు, జైపూర్‌కు మూడు, పర్లాకిమిడికి రెండు, రాయగడకు ఒకటి, ఒనకఢిల్లీకి ఒకటి, దామన్‌జోడికి రెండు, నవరంగ్‌పూర్‌లకు రెండు చొప్పున నడుస్తున్నాయి. కొత్తగా ప్రారంభించబోయే వాటితో విశాఖ నుంచి ఒడిశాకు నడిచే బస్సుల సంఖ్య 21కి చేరనుంది. ఈ సర్వీసులను వివిధ ప్రాంతాల వారికి అనువుగా ఉండేలా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల మీదుగా వేర్వేరు రూట్లలో నడుపుతారు. ఈ రూట్లలో ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్ సర్వీసులను మాత్రమే తిప్పుతారు. ఈ కొత్త సర్వీసులను నిజ శ్రావణ మాసంలో ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు.

తప్పనున్న పన్నుల భారం

ఇన్నాళ్లూ మన ఆర్టీసీ బస్సులు ఒడిశాలో తిరగాలంటే ఆ రాష్ట్రంలో కూడా పన్నులు చెల్లించాల్సి వచ్చేది. అంతేకాదు.. ఎన్నిసార్లు తిరిగితే అన్ని సార్లూ పర్మిట్లు పొందాలి. దీనివల్ల మన ఆర్టీసీకి ఆర్థికంగా భారమయ్యేది. అయినప్పటికీ ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఒడిశాకు బస్సులు నడుపుతున్నారు. ఒప్పందంలో భాగంగా ఇకపై ఏ రాష్ట్రం బస్సులు ఆ రాష్ట్రంలో పన్నులు చెల్లిస్తే చాలు. పైగా ఒక పర్మిట్‌తో ఎన్ని ట్రిప్పులైనా తిరగవచ్చు. ఇలా పన్నులు, పర్మిట్ల భారం నుంచి ఏపీఎస్ఆర్టీసీకి వెసులుబాటు కలగనుంది.

ఇకపై నైట్ హాల్టులకు వీలు

ఇన్నాళ్లూ ఏపీఎస్ఆర్టీసీ బస్సులు ఒడిశాలో నైట్ హాల్టు చేసేందుకు అనుమతి లేదు. అందువల్ల ఏ బస్సైనా రాత్రికి తిరిగి వచ్చేయాల్సి వస్తోంది. కొత్త ఒప్పందం ప్రకారం ఇకపై ఒడిశాలో మన బస్సులు రాత్రి వేళ నైట్ హాల్టు చేసేందుకు వీలుంటుంది. దీంతో రాత్రి నైట్‌అవుట్‌కు వీలు కానందున ఇప్పటిదాకా ఒడిశాకు ఉదయం పూట బయల్దేరి సాయంత్రానికి/రాత్రికి వచ్చేసేవి. ఇకమీదట నైట్ హాల్టు వెసులుబాటుతో పగలు, రాత్రిళ్లు కూడా విశాఖ నుంచి ఒడిశాకు నడపనున్నారు. ఫలితంగా ఒడిశా నుంచి ఆస్పత్రులు, వ్యాపారాల పనులపై ఉదయాన్నే బయల్దేరి అక్కడ నుంచి విశాఖ చేరుకోవడానికి, ఇక్కడ పనులు ముగించుకుని సాయంత్రం, రాత్రి బస్సుల్లో తమ ప్రాంతాలకు వెళ్లడానికి ఎంతో ఉపయుక్తంగా ఉండనుందని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

క్లుప్తంగా

కదిలిన ఏనుగులు



సరసనాపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి

రేగిడి: మూడురోజుల క్రితం రేగిడి మండలంలోకి ప్రవేశించిన ఏనుగులు మళ్లీ వంగర మండలం సంగాం సమీపంలోకి వెళ్లిపోయాయి. సరసనాపల్లి గ్రామంలో మూడు రోజుల పాటు ఇవి తిష్ఠవేశాయి. ఏనుగులు గ్రామం నుంచి వెళ్లిపోవడంతో సరసనాపల్లితో పాటు కందిశ, జోరుబందల గ్రామాల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి గ్రామస్తులతో సోమవారం మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రస్తుతం గ్రామంలో 144 సెక్షన్ తొలగించినట్లు తహసీల్దార్ ఈ సందర్భంగా అన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వస్తు సామగ్రి దగ్ధం



కాలిపోయిన వస్తు సామగ్రి

రేగిడి: మండల పరిధి పనసలవలస గ్రామానికి చెందిన బూరాడ సత్యం ఇంటిలో సోమవారం వేకువజామున షార్ట్ సర్క్యూట్ జరిగి వస్తుసామగ్రి పూర్తిగా కాలిపోయింది. అందరూ నిద్రిస్తున్న సమయంలో వేకువజామున ఫ్రిడ్జ్ వైర్లకు మంటలు వ్యాపించి ఇల్లంతా పొగ ఆవరించింది. నిద్రలో ఉన్న సత్యం, భార్య రుక్మిణి పొగవాసన పసిగట్టి వెంటనే మేల్కొన్నారు. కేకలు వేసి స్థానిక సర్పంచ్ గేదెల గోవిందనాయుడుకు ఫోన్‌చేయడంతో హుటాహుటిన ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లో ఉన్నవారిని బయటకు తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసేలోపే ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా కాలిపోయింది. డాబా ఇల్లు కావడంతో ఇరుగు పొరుగువారికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. వ్యవసాయ కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరు సామగ్రి కాలిపోవడంతో లబోదిబోమంటున్నారు. ఇంటిగోడలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం ఇల్లు మంజూరుచేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

హెచ్‌ఎం పోస్టులు భర్తీచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురం: ఐటీడీఏ పరిధి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పీజీ హెచ్‌ఎం పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్‌కు గిరిజన సంఘం నాయకులు పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్ తదితరులు సోమవారం వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమశాఖలో అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఖాళీలను భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు, సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి తక్షణం పీజీ హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

మాజీ సైనికుల సమావేశం



సమావేశమైన మాజీ సైనికులు

బొబ్బిలి: పాత బొబ్బిలిలో వీర బొబ్బిలి మాజీ సైనికుల సంక్షేమ సంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రెడ్డి దామోదర రావు, గౌరవాధ్యక్షుడు మరడ అప్పారావుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి, రాబోయే స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లకు సంబంధించి చర్చించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు ఆర్‌ఏ నాయుడు, కార్యదర్శి వీఎస్ శర్మ, ట్రెజరర్ గెంబలి శ్రీనివాస రావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

40 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు



సారాతో పట్టుబడిన వ్యక్తులు

సీతంపేట: అక్రమంగా రవాణా చేస్తున్న 40 లీటర్ల సారాతో ఇద్దరు వ్యక్తులను సోమవారం అరెస్టు చేసినట్టు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. కొత్తకోట గ్రామానికి ఎం.మణికంఠ, కె.గంగారావులు అక్రమంగా సారా రవాణా చేస్తుండగా కుడ్డపల్లి ఈతమానుగూడ పరిసరాల్లో పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

‘నవోదయ’ంలో ఉజ్వల భవిష్యత్

- ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఆగస్టు 10 వరకు గడువు
- ఆరు నుంచి 7వరకు ప్రాంతీయ, మాతృభాషల్లో బోధన
- పదో తరగతి వరకు సీబీఎస్‌ఈలో బోధన



కిల్తంపాలెంలోని జవహర్ నవోదయ విద్యాలయం

విజయనగరం పూల్‌బాగ్: ప్రతిభావంతులైన విద్యార్థులకు పట్టంకట్టి ఉజ్వల భవిష్యత్తునిచ్చే వేదిక నవోదయ విద్యాలయం. అందుకే ఈ విద్యాలయంలో పిల్లల్ని చేర్పేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పోటీ పడుతుంటారు. ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఆధారం. ఇందులో ప్రతిభ చూపితే సీటు ఖాయం. 2024–25 ఏడాదికి సంబంధించి ప్రవేశపరీక్ష నిర్వహణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సమయం కేటాయించి ప్రణాళికాబద్ధంగా చదివితే సీటు సాధించవచ్చునని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి 1986లో కేంద్రం జవహర్ నవోదయ విద్యాలయాలు స్థాపించింది. ఈ విద్యాలయాల్లో 6 నుంచి 12వ తరగతివరకు తరగతులు కొనసాగిస్తున్నారు. ఆరు నుంచి 7వరకు ప్రాంతీయ, మాతృభాషల్లో బోధన సాగుతుంది. గణితం, సైన్స్, పాఠ్యాంశాలను ఆంగ్లంలో, సామాజిక శాస్త్రాలు హిందీలో చెబుతున్నారు. పదోతరగతి వరకు సీబీఎస్‌ఈ అమలు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు

ఎస్‌కోట మండలంలోని కిల్తంపాలెంలో జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. 6వతరగతిలో 80 సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది.ఇందుకు ఆగస్టు 10వతేదీ వరకు గడువు విధించారు. అర్హులైన విద్యార్థులు సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్లు), మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

రిజర్వేషన్ విధానం..

ఆరవ తరగతిలో 80 సీట్లు ఉండగా, 75 సీట్లు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి కేటాయిస్తారు. ఐదు సీట్లు పట్టణ ప్రాంతాల వారికి కేటాయించారు. జిల్లా జనాభా ప్రాతిపదికన ఎస్టీలకు 15శాతం, ఎస్సీలకు 7.5శాతం, బాలికలకు 1/3 శాతం, దివ్యాంగులకు 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో వరుసగా 3,4 వతరగతి చదివి అదే పాఠశాలలో ప్రస్తుతం 5వతరగతి చదువుతున్న వారు అర్హులు.నవోదయలో ఉమ్మడి జిల్లా వారీగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

వసతుల కల్పన భేష్

ఎస్‌కోట మండలంలోని కిల్తంపాలెంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో అన్ని సౌకర్యాలు కల్పించారు. ఉత్తమ బోధన అందిస్తున్నారు.విద్యాలయంలో తరగతులకు అకడమిక్ బ్లాక్, పాలనా సౌలభ్యానికి అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరుగా డార్మిటరీలు, భోజనశాలలు, బోధకులు, సిబ్బందికి ప్రత్యేక సముదాయాలు కొలువుదీరాయి. పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వడంతో విద్యాలయం వృక్షాలతో విరాజిల్లుతోంది. విద్యాలయం మొత్తం సీసీ రోడ్డు నిర్మించారు. స్మార్ట్ తరగతులు కొనసాగిస్తున్నారు. డ్రాయింగ్‌టైలర్నింగ్, ప్రయోగాత్మక విద్యను అందిస్తున్నారు. సైన్స్,కంప్యూటర్ ల్యాబ్‌ల సదుపాయం ఉంది.

మంచి అవకాశం...



ప్రతిభ ఉన్న గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇదో గొప్ప అవకాశం. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. తల్లిదండ్రుల కృషి, విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల ప్రణాళికతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే నవోదయలో సులభంగా ప్రవేశం పొందవచ్చును.

– వి.దుర్గా ప్రసాద్, ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయం, కిల్తం పాలెం,విజయనగరం

జాతీయ చెస్ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన ఆంధ్రప్రదేశ్ జట్టు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న చెస్ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్న జట్టు సిద్ధమైంది. నాలుగు రోజుల పాటు విజయనగరంలోని టీటీడీ కల్యాణ మంటపంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో మహారాష్ట్రలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ.జ్వాలాముఖి తెలిపారు. విజయనగరంలో నిర్వహించిన పోటీల్లో ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన ఎం.శ్రీనివాసరావు, కోనసీమ జిల్లాకు సాత్విక్, విశాఖ జిల్లాకు చెందిన ఎం.వెంకటరుత్విక్, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మజ్జి రామ్‌చరణ్‌లు ఎంపికైనట్లు పేర్కొన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మస్తాన్ బాబు, జిల్లా అధ్యక్షుడు బీపీ రావు, ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి ఎం.గణేష్‌నాయుడు, న్యాయ నిర్ణేతలు ఇంటర్నేషనల్ ఆర్బిటర్ జీవీ కుమార్, ఫిడే ఆర్బిటర్ పవన్ రాణీలు అభినందించారు.

సార్వత్రిక విద్య ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్

పార్వతీపురం టౌన్: సార్వత్రిక విద్య ప్రవేశాల పోస్టర్‌ను పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ ప్రేమ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడిందని దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అక్రిడేటెడ్ ఇనిస్టిట్యూషన్ల (ఏఐ)లో ఏఐ కోర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలని, ఎటువంటి అపరాధ రుసుం లేకుండా సెప్టెంబరు 25 లోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకూ అడ్మిషన్‌కు అవకాశం కల్పిస్తారని చెప్పారు.

మీ సేవ చార్జీలు అదనం

పదో తరగతిలో జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,550, అన్ని వర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,150 చెల్లించాలన్నారు. ఇంటర్‌మీడియట్‌లో జనరల్ పురుషులకు రూ.1,800, అన్ని వర్గాల మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్సీ, మైనారిటీ వారికి రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించాలని వివరించారు. ఈ ఫీజులకు అదనంగా మీసేవ చార్జీలు 36 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పదో తరగతిలో చేరేందుకు వచ్చే ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలని, ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి ఉండదన్నారు. దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డ్ షీట్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌మీడియట్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, టెన్త్ టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణపత్రం, దివ్యాంగులు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఏం జరిగిందో? ఏమో?

- లాడ్జిలో హతురాలి వివరాలు లభ్యం
- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు



హతురాలు ఆరిపాక ఈశ్వరమ్మ

శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలో ఆదివారం కలకలం రేపిన హత్యకేసులో పోలీసులు పురోగతి సాధించారు. చందన్ లాడ్జిలో వెలుగుచూసిన హత్యోదంతంలో హతురాలిని దేవరాపల్లికి చెందిన ఆరిపాక ఈశ్వరమ్మ(48)గా నిర్ధారించారు. కాగా ఈశ్వరమ్మ ఒంటిపైన ఉన్న బంగారం కోసమే హత్య చేసి ఉంటారన్న అనుమానాలు వినిపిస్తున్నాయి. ఆమె కొన్నేళ్లుగా ఎస్.కోటలోనే నివాసం ఉంటోంది. అయితే ఈ హత్య కేసులో నిందితుడు ఎవరు? ఏ ఉద్దేశంతో హత్య చేశాడు? హత్య జరిగి ఎన్ని రోజులైంది? కేవలం బంగారం కోసమేనా? పాత కక్షలు ఏమైనా ఉన్నాయా? అన్న విషయాలు తెలియాల్సి ఉంది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే పూర్తిస్థాయి వివరాలు సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం. మరిన్ని కచ్చితమైన సాక్ష్యాల సేకరణలో పోలీసులు నిమగ్నమయ్యారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మంగళవారం వెల్లడించే అవకాశం ఉంది.

హత్య కేసులో నలుగురికి పదేళ్ల జైలు శిక్ష

రాజాం సిటీ: హత్య కేసులో రాజాంకు చెందిన నలుగురికి పదేళ్ల కఠిన కారాగార శిక్షను న్యాయస్థానం విధించింది. రాజాంలో 2018 సెప్టెంబర్ 17వ తేదీన కొండేటి అప్పారావు (65)పై అదే గ్రామానికి చెందిన కొండేటి పోలీస్, కొండేటి రమణ, చిన్నారావు, కొండేటి గౌరి, కొండేటి సుశీల దాడికి తెగబడ్డారు. ఈ దాడిపై మృతుడి బంధువులు కనకరాజు, మహేశ్వరరావులు ఫిర్యాదు చేశారు. దాడి అనంతరం అప్పారావు చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో ఈ ఐదుగురిపై రాజాం పోలీసులు కేసును నమోదు చేసి, దర్యాప్తు చేశారు. కోర్టులో హాజరు పరచగా చావుకు ఐదుగురు బాధ్యులని రుజువు కావడంతో కొండేటి రమణ, కొండేటి చిన్నారావు, కొండేటి గౌరి, కొండేటి సుశీలకు పదేళ్ల కఠిన కారాగార శిక్షను మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి బి.భాస్కరరావు తీర్పునిచ్చారు. మరో ముద్దాయి కొండేటి పోలీసు ఇటీవల మృతి చెందారు. దీంతో నలుగురికి శిక్ష ఖరారు చేశారు. జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్షను అమలు చేయాలని తెలిపారు. అలాగే వేర్వేరు సెక్షన్ల కింద ఈ నలుగురికే మరో రెండేసి సంవత్సరాల పాటు కారాగార శిక్ష వేశారు. ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అమలు చేయాలని తీర్పునిచ్చారు. ఈ కేసు దర్యాప్తు రాజాం సీఐ వేణు కుమార్, వేణుగోపాలరావు చేయగా, ఫ్యామిలీ కోర్టు పీపీ వాన కృష్ణ చంద్ వాదించారు.

జాతీయస్థాయి పోటీలకు పాలిటెక్నిక్ విద్యార్థి

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి పశుసంవర్థక కళాశాలలో పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పాతరపల్లి శంకర్ రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో 42 కేజీల విభాగంలో విజేతగా నిలిచా డు. ఈ నెల 29, 30 తేదీల్లో అనకాపల్లి రాజీవ్‌గాంధీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీ ల్లో ప్రతిభను చాటి బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ డా.కె.బసవరెడ్డి, అధ్యాపక సిబ్బంది సోమవారం అభినందించారు.

ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి



ప్యాసింజర్‌లో బాత్‌రూమ్ వద్ద మృతిచెంది ఉన్న వృద్ధుడు



ప్లాట్‌ఫాంపై పడి ఉన్న మృతుడు ధనరాజ్

విజయనగరం క్రైమ్: విశాఖ నుంచి విజయనగరం వచ్చిన ప్యాసింజర్ నుంచి ప్రయాణికులు అంతా దిగి వెళ్లిపోయారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో రైల్వే సిబ్బంది తలుపులు మూసేందుకు రైలెక్కగా బాత్‌రూమ్ వద్ద గులాబీ రంగు షర్ట్, దుప్పటి ధరించి ఉన్న సుమారు 60 నుంచి 70 ఏళ్ల వయుసు కలిగిన వృద్ధుడు మృతిచెంది ఉన్నాడు. ఈ మేరకు రైల్వే సిబ్బంది పోలీసులకు ఫిర్యాదుచేశారు. అలాగే వీటీ అగ్రహారం బీసీకాలనీకి వెళ్లే దారిలో ట్రాక్ పక్కన శరీరంపై బట్టల్లేకుండా 40 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రెండు మృతదేహాలను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి జీఆర్‌పీ ఎస్సై రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి..

కదులుతున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి సోమవారం వేకువజామున మృతిచెందాడు. విజయనగరం స్టేషన్‌లోని ఐదో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు వెళ్లేందుకు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఎక్కడానికి విశాఖలో వెయిట్ చేస్తున్న ఎస్.ధనరాజ్ (54) రైలు ఆలస్యంగా నడుస్తుందన్న విషయం తెలుసుకున్నాడు. రాత్రి 9 గంటలకు రావాల్సిన రైలు మూడు గంటలు ఆలస్యంగా వచ్చింది. అప్పటివరకూ అక్కడే కుర్చీలో కూర్చున్న ధనరాజ్ నిద్రలోకి జారుకున్నాడు. రాత్రి 2 గంటలు దాటిన తర్వాత మెలకువ వచ్చింది. ఎదురుగా హౌరా వైపు వెళ్తున్న ఫలక్‌నుమా కనిపించే సరికి అదే తాను ఎక్కాల్సిన రైలు అని భావించి పొరపాటున ఎక్కేశాడు. రైలు విజయనగరం వచ్చేసరికి స్టేషన్ చూసి నివ్వెరపోయాడు. ఇంతలో రైలు కదలడంతో రైల్లోంచి దిగిపోయేందుకు ప్రయత్నించి ప్లాట్‌ఫామ్, రైలు మధ్యలో ఇరుక్కుపోయాడు. దీంతో చేతులు, కాళ్లు తెగిపడిపోగా అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు మృతుడి కుటుంబసభ్యులకు సమాచారమందించి మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షుద్రపూజల కలకలం



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రాజాం: పట్టణంలోని అమ్మవారికాలనీ రెండవలైన్‌లో రోడ్డుపై దర్శనమిచ్చిన క్షుద్రపూజల వస్తువులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. సోమవారం ఉదయం కాలనీవాసులు లేచి ఇంటి పరిసర ప్రాంతాలు శుభ్రం చేసుకుంటుంగా, వీధి మధ్యలో సీసీ రోడ్డుపై ఎండమిరపకాయలు, నిమ్మకాయలు, పసుపు, కుంకుమ కలిపిన అన్నం, కోడిగుడ్లు పడి ఉండడాన్ని మహిళలు గమనించారు. వెంటనే భయభ్రాంతులకు గురై పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రాజాం టౌన్ సీఐ రవికుమార్ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించి ఆరాతీశారు. పట్టణ పారిశుద్ధ్య కార్మికులను పిలిపించి క్లీన్ చేయించారు. ఇదిలా ఉండగా ఈ వస్తుసామగ్రి అంతా క్షుద్రపూజలకు సంబంధించినదని పలువురు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. జనావాసాల మధ్య ఇలాంటి భయానక వస్తుసామగ్రి పడి ఉండడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాలనీలో జరుగుతున్న ఇటువంటి ఘటనలపై పోలీసులు దృష్టిసారించి, భవిష్యత్‌లో జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాలనీలోని సీసీ రోడ్డు మధ్యలో నిమ్మకాయలు, పసుపు, కుంకుమ సామగ్రి

ఏజెన్సీలో అలజడి

- మావోల సంస్మరణ వారోత్సవాల ప్రకటనలో పోలీస్ బలగాలు అప్రమత్తం
- విస్తృతంగా వాహన తనిఖీలు
- రోడ్ల కల్వర్టుల్లో నిశితపరిశీలన
- మావో ప్రభావిత గ్రామాల్లో కూంబింగ్!



ఆర్ఓపీ చేస్తున్న ఏపీఎస్పీ బలగాలు

మక్కువ: మావోయిస్టుల సంస్మరణ వారోత్సవ (గతనెల 28 నుంచి ఈ నెల 3 వరకు) పిలుపుతో ఆంధ్రా–ఒడిశా సరిహద్దు (ఏఓబీ)లో అలజడి నెలకుంది. పోలీస్ ప్రత్యేక బలగాలు అప్రమత్తమయ్యాయి. వాహన తనిఖీలను ముమ్మరం చేశాయి. రోడ్డు కల్వర్టులను ఆర్ఓపీ(రోడ్డు ఓపెనింగ్ పార్టీ) నిశితంగా పరిశీలిస్తోంది. ఏజెన్సీలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తోంది. మక్కువ ఎస్‌ఐ జి.పైడిరాజు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, ఏపీఎస్పీ బలగాలు సరిహద్దు గ్రామాలను జల్లెడపడుతున్నాయి.

అడుగడుగునా పోలీసులు..

ఏఓబీ సరిహద్దు గ్రామాలైన ఎర్రసామంతవలస, దుగ్గేరు, మూలవలస, బాగుజోల, చిలకమెండంగి, మెండంగి, గుంటబద్ర తదితర గ్రామాల వైపు బలగాలు ముమ్మరంగా కూంబింగ్ చేస్తున్నట్టు సమాచారం. వారంరోజుల పాటు అమరవీరులు సంస్మరణ వారోత్సవాలకు మావోలు పిలుపునివ్వడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయాందోళన ఈ ప్రాంతీయుల్లో నెలకుంది.

విస్తృత తనిఖీలు

ఏజెన్సీ గ్రామాల రహదారులపై ఉండే కల్వర్టులును మెటల్ డిటెక్టర్ సాయంతో పోలీసులు నిశితంగా తనిఖీ చేస్తున్నారు. ఏజెన్సీ నుంచి మండలకేంద్రానికి వచ్చిన వాహనాల వివరాలు నమోదు చేస్తున్నారు. అనుమానిత వ్యక్తులను ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాత్రివేళల్లో గస్తీకాస్తున్నారు. అయితే, ఆరోఓపీ మాత్రమే నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఐ జి.పైడిరాజు తెలిపారు.

బొబ్బిలి సిగలో మరో మణిహారం

- రూ.235.30 కోట్లతో మెసర్స్ సత్యా బయోఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఏర్పాటు
- ఈ నెలలోనే ఏపీఐఐసీ 30 ఎకరాల భూ కేటాయింపు
- వేగావతి నుంచి 1600 కిలోలీటర్ల నీటి సరఫరాకు అనుమతులు
- 200 మందికి ఉపాధి కలిగే అవకాశం



గ్రోత్ సెంటర్

బొబ్బిలి: బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో కొద్దినెలల్లో మరో పరిశ్రమ ఏర్పాటుకానుంది. ఇటీవల ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఇక్కడ ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు 30 ఎకరాలు కేటాయించాలని ఏపీఐఐసీకి సూచించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం జూలై 21న జీఓ నంబర్ 64ను విడుదల చేసింది. వేగావతి నది నుంచి 1600 కిలోలీటర్ల నీటి సరఫరాకు అనుమతులు ఇస్తూ జీఓ నంబర్ 56ను విడుదల చేసింది. పరిశ్రమ ఏర్పాటైతే స్థానికులకు, ఇతరులకు కలిపి 200 మందికి పైగా ఉపాధి అవకాశం లభిస్తుందని ఏపీఐఐసీ అధికారులు చెబుతున్నారు. గ్రోత్ సెంటర్ లో మెసర్స్ సత్యా బయోఫ్యూయల్స్ ప్రైవేటు లిమిటెడ్ కోసం 30 ఎకరాలు కేటాయించేందుకు ఈ వారంలోనే అనుమతులు ఇవ్వనున్నట్టు గ్రోత్ సెంటర్ అధికారులు తెలిపారు. స్థలం చూపించిన వెంటనే సంబంధిత యాజమాన్యం పనులు మొదలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్నారు.

రూ.235.30 కోట్లతో పరిశ్రమ

గ్రోత్ సెంటర్‌లో రూ.235.30 కోట్ల ఖర్చుతో మెజర్స్ సత్యా బయోఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటుచేసేందుకు అనుమతులు కోసం కంపెనీ యాజమాన్యం దరఖాస్తు చేసింది. ఇథనాల్ ఉత్పత్తి చేసే పరిశ్రమకు ప్రధాన వనరైన నీరు వేగా వతి నదినుంచి లభించే అవకాశం ఉండడంతో పరిశ్రమ ఏర్పాటుకు కంపెనీ ప్రతినిధులు చకచకా అడుగులు వేస్తున్నారు. పరిశ్రమ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ప్రభుత్వం ఏపీఐఐసీకి లేఖ రాసింది.

త్వరలోనే పనులు ప్రారంభం

ప్రభుత్వ ఆదేశాలు, ఉత్తర్వుల ప్రకారం కొద్ది రోజుల్లోనే మా ఉన్నతాధికారులు అనుమతులు ఇవ్వనున్నారు. యాజమాన్యానికి స్థలం అప్పగిస్తాం. వెంటనే పనులు ప్రారంభించేందుకు వారు సిద్ధంగా ఉన్నారు.

– యతిరాజు, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ, శ్రీకాకుళంజోన్